జీబున్నిసా*

ముద్దా విశ్వనాథముగారు (కవితాసమితి)

ముసల్మానువనితాలోకమున నగ్రస్థానమువహించిన విదుషీరత్నములలో నొకతెయు, జ్ఞానవతియునగు "జీబున్నిసా" ఔరంగజీబుచక్రవర్తిగారి ప్రథమతనూజ.

అద్భుతమేధానిధియగు నీపె లేఁబ్రాయమున తన 7-వ యేటనే తురుష్కులపవిత్ర గ్రంథము "కొరాను" కంఠస్థముగావించుకొనినది. అటుపై నాలుగువత్సరములలో అరబిక్, పర్షియనుభాషలలో ప్రావీణ్యతగడించెను. ఇదిగాక గణితఖగోళశాస్త్రము లామె యభిమానశాస్త్రములు. ఈరాజపుత్రికి 21 ఏండ్లప్రాయమప్పుడు "ముల్లాసయీద్ అష్రఫ్" అనుపేరొందిన కవీశ్వరుఁడు గురుపదవినిస్వీకరించి, చాలపట్టుదలతో తనధర్మము నిర్వహింప 13, 14 వర్షములు ఆమె దివ్యవిద్యాసాగరమున నీఁదులాడుచుండెను. ఖగోళవేదాంత శాస్త్రాదివిషయములు సరసతయుప్పతిల్ల గురువుగారితో చర్చించుటెంతయు నామెకు ముచ్చట గొల్పుచుండెడిది. అప్పటి పండితప్రకాండములనెల్ల దర్బారుకురప్పించి, వారివలన ఉత్తమోత్తమవిద్యవడసినది. ఇంతయేల? ఏవిద్యయందును ఆమెకు సరియగుచేయిలేదనిన అతిశయోక్తిగాదు. ఇకదస్తూరీ ముక్తాఫలములే! జీబున్నిసా గొప్పకవయిత్రిగాగూడ ప్రతీతిగాంచినట్లు చరిత్రకారు లుగ్గడించియున్నారు. ఈమెచే నప్పటప్పట వ్రాయఁబడినలేఖలు "జీబుమన్షట్" అనుపేర గ్రంథరూపమున వెలువడినవి.

విఖ్యాతకవిపుంగవులను సన్మానించి సత్కరించుటయం దీపెకు మిక్కిలి అభిలాష. ఆమెదర్బారు ఆదర్శప్రాయమగు నొక 'పరిషత్తే'నవలసినదే. అటనుండు పండితబృందము శాస్త్రకళాభివృద్ధికై వలయు గ్రంథజాలమంతయు పర్షియనుభాషలోని కనువదించుటలో రాత్రింబగళ్లు తెఱపిలేక మునిఁగియుండువారు. రాజపుత్రి తర్జుమాచేయించిన పుస్తకములన్నిటికిని పేర్లుంచుటలో తనయింటిపేరు "జీబీ" ప్రతినామమునకును మొదట చేర్పఁబడుచుండెను. ఆమె ఏర్పఱిచినగ్రంథాలయమునకు సరితూఁగుభాండాగారము మఱియొకటేదియు ఆకాలమునలేదు.

రాజపుత్రి సంభాషణచమత్కారమును, అందలిహాస్యరసమును ఔరంగజీబుయొక్క పెడబుద్ధినిమరలించుట కనుకూలముగనుండెను. తనబుద్ధినైశిత్యముచేతను, సద్గుణసంపత్తిచేతను తండ్రిలోపములు కప్పిపుచ్చి సవరించుచుండగల్గెడిది.

కవితయనుమాట చక్రవర్తికి చెవినిబడఁగూడదు. అయినను జీబున్నిసాకు అభిరుచిగల అట్టివిషయములలో కాలము వినియోగించుకొనుట కత డడ్డంకిపెట్టెడివాఁడుకాఁడు; పూర్ణమైనస్వాతంత్ర్య మామెకొసంగెను. ఒకనాఁడాయన హఠాత్తుగా ఆమెగదిలోనికి వచ్చెను; అపుడు తనపుత్రి "దివాని-హాఫీజు" అను నుత్కృష్టగ్రంథముఁజదువుటలో నిమ

*శ్రీ ఎ. హమీద్ హసనుగారి ఆంగ్లేయవ్యాసము నాధారముచేసికొని వ్రాసినది—ము. వి.

గ్నయైయుండుటగనెను. ఆమె భయభ్రాంతురాలైనది. మర్యాదాపూర్వకముగ చప్పున లేచి నిలఁబడుటవలన వణఁకుచున్న మృదుహస్తములనుండి పుస్తకము మెల్లగజాఱి క్రిందబడెను. అంత నౌరంగజేబు కొమార్తెను భయపడవలదని సముదాయింపగా నామె స్వస్థచిత్తయై తండ్రితో నిట్టులనెను:—"నాయనగారూ! మీరిచట అడుగిడినపుడు నేను "దివాని-హాఫీజు" గ్రంథము నతిశ్రద్ధతో పఠించుచుంటిని; ఈపనికి మీరుగ్రులగుదురేమోయనుభీతిచే నాకు దేహముకంపించినది." అందులకు చక్రవర్తి:—"అమ్మా! ఆగ్రంథములోని ఏభాగము నాకుఁ గోపముగల్గించునని నీవనుకొంటివి?" అని యడిగెను. అపుడు రాజపుత్రి ఈవాక్యములు వినిపించెను;—"నిన్నను దేవతలువచ్చి పానశాలలతలుపులు బ్రద్దలుగొట్టుట నేకనులారఁగాంచితిని. వారు ఆదాముయొక్కమట్టితో నొకలోటారూపము తయారుచేసిరి."

ఔ.—దీనిభావ మేమనిగ్రహించితివి?

జే:—ఈరెండువాక్యములలోను 'హాఫీజు' మానవజీవితతత్త్వము చక్కఁగనిమిడ్చి వర్ణించియున్నాడు. అతనియభిప్రాయ మేమన పానపాత్ర ఒకచేతినుండి మఱియొకచేతికి తిరుగుచుండును. భూమికూడ పాత్రవలెనే గుండ్రముగనున్నది; అదియు తిరుగుచుండును. మనుజుఁ డొకమట్టిప్రతిమ. దేశ, కాల, పాత్రత లెటులున్నను అతనికి చిత్తచాంచల్యము స్వాభావికము. ఎట్టిప్రశాంతపరిస్థితులలోనైనను మనోవేగముయొక్క ఉద్ధతి వర్ణనాతీతము. ప్రతివిషయములోను మనసు సదా కలఁతనొందుచునేయుండును. దుర్దశాబాధలు సంభవించినపుడు వేదనవదలి యెట్లీవలఁబడుదుమాయను తహతహ; సౌఖ్యాంబుధిలో నోలలాడుతఱి ఇదిలేదు అదిలేదు అని ఏవోకొఱఁతలుకల్పించుకొని మఱికొన్నిసౌఖ్యములకై ప్రాఁకులాడుట; ఇది మనసు నిర్వర్తించుపని. మనమువసించుభూమియే తిరుగుచున్నపుడు మనము (మనమనస్సులు) తిరుగుట అసహజముగాదు." ఈచక్కనివ్యాఖ్యానము చక్రవర్తికి మనసున గాఢముగనాటుకొని దానిని మిక్కిలి రంజించెను.

తన పూఁదోఁటలోను, 'మహాలు'లోను జేబున్నిసా స్వేచ్ఛగా విహరించుచుండెడిది. అందుచేత ఘోషాపద్ధతివర్జించినదని మనమనుకొనఁగూడదు. కులాచారమునసుసరించి ముఖమున మేలుముసుఁగు (పరదా) లేకుండ ఆపె యెవరికంటను బడకుండెను.

జేబున్నిసాను ఒకయింటియామెగఁజేయవలెనని రాణిగారు మిక్కిలి యాశించుచుండెను. వైవాహికవిషయములో రాజపుత్రియభిప్రాయము లుదారములుగనుండెను. ఉద్వాహమునం దనిష్టతలేదుగాని, తనకు నచ్చినఘనుఁడు లభించుట దుర్లభమాయెను. ఎందరెందఱో జమీందారులు, రాజపుత్రులు నామెను బరిణయమాడ తగుయత్నములుసల్పిరికాని వారెల్లరకును 'ఉహు' అనియే జవాబువచ్చుచుండెడిది.

ఆగ్రాకురావలసినదని పర్షియాదేశపుయువరాజగు "ఫరూక్"నకు రాణిగారు కబురంపిరి; ఎటులయిన కూఁతునకు నచ్చఁజెప్పి ఈసంబంధము స్థిరపఱుపవలెనని యామె

ముఖోద్దేశము. ఈతఁడు మంచి సుందరాకారుఁడేకాని యతనిసౌందర్యము జీబున్నిసామనసు నాకర్షింపఁజాలకపోయెను. ఈబాంధవ్యమొప్పుకొనుమని రాణి మఱిమఱి హితబోధము చేసినది. వరుని విజ్ఞానసామర్థ్యాదులు పరిశోధించికాని యేదియు నిర్ధారింపఁజాలనని జీబున్నిసా వల్కెను. అంతట నొకదినమున ఫరూక్ రాజపుత్రుఁడు 'మహాలు'లో విందున కాహ్వానింపఁబడెను. చక్రవర్తిగారితనయ పరులకగపడనియేర్పాటుగల తెరచాటున ఆసీనురాలయ్యెను. రాచకుమారుఁడు అతని మంత్రిబృందము, సహచరులు ఎల్లరును భోజనమున కుపక్రమించిరి. కొంతసేపయినపిమ్మట ఫరూక్ తన చతురోక్తులచే రాజపుత్రిని ఆనందింపఁజేయుతలంపుతో నామెకు వినఁబడులాగున నిట్లనెను:—"సాన్బోసా బిసాన్ మి ఖాహమ్" అనఁగా—"నాకు 'బిసాన్ సాన్బోసా' కావలెన"నియర్థము. 'సాన్బోసా' అనుమాటలో 'సాన్' అనుపదము విడఁదీసినచో "బోసా" అనుమాట మిగిలియున్నది. దీనికి 'ముద్దు' అనియర్థము. శౌర్యహీనములును, అమర్యాదకరములునునగు నీలఘువచనములు జీబున్నిసావంటి ఉత్తమరాజపుత్రిమనసు నెంతకలఁచివైచెనో దెలుపనలవికాదు. ఆమె రోషావేశపూరితయయ్యు కొంచెము నిదానించి నిశ్చలచిత్తముతో 'చెప్పుదెబ్బకొట్టినట్టు' లీజవాబు వెంటనేయిచ్చెను:—"అజ్ మతాబఖ్-ఎ-మదార్ తలాబ్"-అనఁగా "నీతల్లినుండియే గ్రహింపుము" ఈసమాధానము వినినవెంటనే 'ఫరూక్' నకు గర్వభంగమైనందున నతఁడు తలవంచుకొని, రెండవకంటివానికిఁ దెలియకుండ ఆరాత్రియేమూటయుముల్లెయుఁగట్టుకొని తనరాజ్యమునకు పయనమైపోయెను.

జీబున్నిసా తనజీవితాంతమువఱకును అకళంకబ్రహ్మచారిణిగనేయుండినది. "వివాహ" మనుమాట ఆమెచెవినోఁకినంతయు బాధకరముగనుండెను. పురుషసంపర్కమన్న నామెకు తలనొప్పిదెచ్చుచుండెను. కలికాలమున నొకరిద్దఱట్టిపవిత్రస్త్రీలున్నను జనసామాన్యములో నట్టివారున్నారనునమ్మకముపుట్టుట వట్టిమాట. మీఁదు మిక్కిలి 'లోకులుకాకుల' నునట్లు సచ్చరితలఁజూచి పెక్కురు కన్నులలోదుమ్ముపోసికొందురు! అసూయాగ్రస్తులగు కొందఱు ఈమెకును, లాహోరులో మొఘల్గవర్నరుగానుండిన కవిసత్తముఁడగు 'అకిల్ ఖాను'నకు నశ్శృంగారవిషయకపరస్పరసంబంధములుండెనని యపవాదములుచేసిరి. వివేకము గలవారెవ్వరును ఆయసంబద్ధప్రలాపములు నమ్మరైరి. కాని ఉబుసుపోక అట్టి నిందాసంభాషణములే కూడును, గుడ్డయునుగాఁజేసికొను సోమరిపోతుల నోళ్లరికట్టఁగలమా? రాజపుత్రి పెండ్లియాడకపోవుటచేతనే యపనిందలకుపాల్పడవలసివచ్చెనని కొందఱు చరిత్రకారులఊహ.

పరమపూజ్యురాలును, ప్రఖ్యాత ముసల్మాన్నారీరత్నమునునగు నిట్టి రాజపుత్రి తన 65-వ యేటఁ బరమపదమునొంది లాహోరుదరినున్న "నవన్కోట"లో సమాధినందెను.

ఆలలనయొక్క పవిత్రాత్మసుప్రసిద్ధమృతజీవులతోఁగలసి మింటమెఱయుచు తన జీవితములో సుగుణములేవేనియున్న గ్రహించి శక్త్యనుసారమాచరింపుఁడని తోడిసోదరీమణులకు ప్రబోధముసేయుచున్నది!

౨

ఆకుండి వేంకటశాస్త్రి గారు

ఈమె మొగలాయిపాదుషాయగు ఔరంగజేబునకు జ్యేష్ఠపుత్రిక. ఈమె 1639-వ సంవత్సరమున జన్మించెను. ప్రసిద్ధమగు తైమూరులేన్, జెంగీజ్ ఖాన్ అనువారల వంశమునకు చెందినదీమె. ఈమె కాలమునకు ముందున్న మొగలాయిచక్రవర్తులు విద్యాశోభితులును, విద్యాపోషకులునై వెలసిరి.

ఇట్టి వైదుష్యసాంప్రదాయముగల మొగలాయిప్రభువులలో నొకడగు ఔరంగజేబు కొమరితయై జీబున్నీసా పరిష్యన్‌భాషలో పాండిత్యప్రకర్షను చాటునట్టి పద్యములను రచించి యజరామరకీర్తిని గడించినది. అధునిక పరిష్యన్‌భాషాపండితు లామె కవితామాధురికి చొక్కియున్నట్లు తెలియవచ్చుచున్నది. ఈమె జీవితములోని ప్రత్యేకవిశేషములనెల్ల తెలిసికొనుటకీమె జీవితచరిత్రమేమియు వ్రాయఁబడియుండలేదు. ఈమె జీవితపు కడపటిభాగమున తీవ్రకోపియగు యీమె తండ్రియాగ్రహమునకు పాత్రుఁడుకావలసివచ్చునేమో యని ఔరంగజేబు దర్బారునగల చరిత్రకారులలో నొక్కడైనను ఈమె జీవితచరిత్రనువ్రాయ సాహసింపలేదు. ఈమెతల్లి దిల్‌రసుబానుబీగం. ఈమె బాల్యమునుండియు తనబుద్ధివైశద్యమును వెల్లడించుచున్నందున నీమెకు సమర్థులగు విద్యాగురువులచే తండ్రి చదువుచెప్పించుచు వచ్చెను. ఈమె కడుచిన్నతనముననే 'ఖొరాను' కంఠస్థమొనర్చుకొనెను. తండ్రి 'జీబున్నీసా' కొరాను కంఠస్థముచేసికొన్నందులకు కడు సంతసమంది తనకోటలో గొప్పవిందుచేసెను. ఢిల్లీలోగల మైదానమున తన సైనికులకెల్ల మృష్టాన్నముతో విందొసగెను. బీదలకు ధర్మముక్రింద ముప్పదివేల బంగారుమోహర్లు ఖర్చుపెట్టెను. రెండుదినములు సర్కారుకచ్చేరీలు మూయబడెను. జీబున్నీసాకు 'మియాబాయి' యనునామె ఉపాధ్యాయినిగా నియమింపఁబడెను. ఈమె నాలుగువత్సరములు 'అరబిక్'భాష శ్రద్ధతో నేర్చెను. ఈమె గణితశాస్త్రమును, జ్యోతిశ్శాస్త్రమును చదివి అందధికప్రావీణ్యమును గడించెను.

ఈమె 'ఖొరాను'పై వ్యాఖ్యను రచింపఁబూనెను. కాని తండ్రి యీసంగతి తెలిసికొని ఈమె యట్టి కార్యముచేయ దలపెట్టసాహసమని తలచి ఈమెను వారించెను. ఈమె చిన్నతనమునుండియు పద్యముల నవర్గళముగ రచించుచుండెను. మొదట ఈమె 'అరబిక్'భాషలో, పద్యరచనము నారంభించెను. ఈమె తన మాతృభాషయగు పరిష్యన్‌భాషలో కడుధారాళముగ పద్యరచనమును చేయగలదు. షారుస్తుంఘాజీ యను మహాపండితుడొకడామెకు పరిష్యనుభాషలోని మహత్తరగ్రంథములను చెప్పుచుండెను. ఈగురువే ఈమెకు పద్యరచనమందు ప్రవేశమునుగల్గించినాడు. ఈమె తాను పరిష్యనుభాషలో రచించిన పద్యములను తనగురువునకుకూడ చూపుటకు సిగ్గుపడుచుండెడిది. కాని ఆమె యప్పుడప్పుడు రచించిన గీతములను చిన్నకాగితములపైవ్రాసి వానిని తన పాఠపుస్తకములలో నక్కడక్కడ భద్రపరచుచుండెను. ఆమె యెదుట లేనప్పుడాపండితుడామె పాఠపుస్తకములలో నక్కడక్కడనుంచబడిన పద్యములువ్రాయబడినకాగితములనుగాంచి యందలి పద్యములనుగాంచి ఆశ్చర్యపడుచుండెడివాడు. మఱియు నతడీమెపేరు వాసిగాంచగల యంతటి కవయిత్రి కాగలదని వాక్రుచ్చెను. ఈపండితుడు ఔరంగజేబును తన నౌకరులను దేశములోనికి పంపించి పరిష్యానుండియు, కాశ్మీరమునుండియు మరియితరప్రాంతములనుండియు గొప్పపండితులను వెదకింపఁజేసి వారిన ఢిల్లీఆస్థానమునకురప్పించి వారలతో రాకొమరితకు విద్వద్గోష్ఠిఁగలిగింప హెచ్చరించెను. ఔరంగజేబునకు పండితులు, కవులు అనిన నధికగౌరవాదరణభావములు లేనివాడయ్యు రాకొమరితకై పేరుమోసిన కవులమరప్పించి వారిని పోషించుచువచ్చెను. ఔరంగజేబు హాఫీజురచితగ్రంథములు పాఠశాలల

లోని బాలురచేగాని, జనానాలో బీగముచేగాని చదువబడుటకు నిషేధించినను 'జీబున్నీసా' మాత్రము వానినిజదువ నియ్యకొనెను. రాకొమరిత విద్వద్గోష్ఠికై నాసిర్ ఆలీ, సాయా, షాముష్‌వాలీఉల్లా, బెహురాజ్ అను విద్వత్కవులను పాదుషా పోషించుచుండెను. నాసిర్ ఆలీ పరిష్యనుభాషలో మనోహరమగు పద్యములను రచించుచుండెను. 'జీబున్నీసా' యాపద్యములనుచదివి వానిని మెచ్చుకొనుచుండెను. ఆతడు పద్యములు వ్రాయుటలో నామెకు ప్రతిస్పర్థియగుచువచ్చెను. ఈమె తన విద్వద్బృందముతో వినోదగోష్ఠిగా సమస్యాపూరణాదులనేర్పాటుగావించి వినోదించుచుండెడిది.

ఇట్టి వినోదగోష్ఠిని 'ముషెయిరా'అందురు. ఈవినోదగోష్ఠియందు 'జీబున్నీసా' కడు చాకచక్యమును బుద్ధివైశద్యమును ప్రకటించుచువచ్చెడిది. షాజహాన్ జీవించియున్నప్పుడీమెను తన పెద్దకుమారుడగు దారా కొమారుడగు 'సొలైమాన్ షెకొ'కునిచ్చి పెండ్లిచేయఁదలపెట్టెను. ఔరంగజేబు దారాయనిన యసహ్యించుకొనును. ఆతడనిన కడుభయము. అందుచే నతడు తనకొమరిత దారాకొమరున కివ్వబడుట కిష్టపడలేదు. తన యిష్టమునకు వ్యతిరేకముగ తండ్రియావివాహమును కావించునేమోయని దారాకొమరునికి విషము పెట్టించి చంపించెను. ఈమెను వివాహమాడ నెందఱో రాజపుత్రులు ప్రయత్నించిరి. కాని యీమె తాను స్వయముగ రాజపుత్రులనుచూచి తనకిష్టమగువానిని నిర్ణయించుకొని వివాహమాడుదు ననుచుండెడిది. అందుచే నీమెకు నచ్చినవరుడు లభింపమి చాలకాలము యవివాహితగనే యుండెను. అదిగాక తానావీరపుత్రుని శౌర్యవైదుష్యాదిగుణగణములను పరీక్షించి మరి వివాహమాడుదు ననుచుండెడిది. అట్టివరులలో ఐరాన్ దేశపు రాజైన రెండవ షాఅబ్బాస్‌అను రాజుకుమారుడైన మిర్జాఫారూక్ అనునతడొకడు. జీబున్నీసాయాతనిని ఢిల్లీకిరమ్మనియు, యాతనిని చూచినమీదట వరింతుననియు యతనికొకలేఖ వ్రాసెను. ఆతడును యామె యాహ్వానము నంగీకరించి పరివారసమేతముగ ఢిల్లీకివచ్చెను. జీబున్నీసాయు నాతనిని తన యుద్యానవనమున గల ప్రత్యేకమందిరమున విడియఁజేసి, తానేస్వయముగ మేలిముసుంగు ధరించియే యాతనికివలసిన భోజనాది పరిచర్యలనుగావించెను. ఆతనికి బహువిధభోజ్యపదార్థములతో (పిండివంటలు, మిఠాయిలు) విందులను జేసెను. ఒకనాడాతడు విందారగించునపుడు, తనకొకవిధమగు మిఠాయి వడ్డింపకోరుచు అందులకై యుపయోగించిన భాషలో మిఠాయికేగాక ముద్దుఅను నర్థమునిచ్చునట్టిదియునగు నొకపదమును బ్రయోగించెను. అంత నామె సునిశితమగు బుద్ధిగలదగుట యందలి 'ధ్వని'ని (ద్వంద్వార్థమును) గ్రహించి కుపితయై మావంటశాలనుండి మీకుకావలసినది మాత్రమడుగుఁడు. అది వడ్డింపఁబడునని ప్రత్యుత్తరమిచ్చెను. తదనంతరము ఆరాకొమరునిగూర్చి చెప్పుటలో యతని రూపాదులు తనకునచ్చినను యాతని 'ఫాయి' మాత్రము నచ్చలేదనియు, యందుచేత నాతనిని వివాహమాడనని చెప్పెను. 'మిర్జాఫారూక్' అటుల తిరస్కరింపబడియు యీ క్రింది భావముగల పద్యమువ్రాసి యామెకు పంపెను. "నే నీమందిరమును విడిచివెళ్లను. నేనిచ్చట సాష్టాంగముగ పరుండియుండెదను. నాకీజీవితమున సౌఖ్యానందములు జీబున్నీసావలననేగలవు." ఆపద్యమునుచదివి, యతని మౌఢ్యమునకు కోపించి 'ఓబాలుడా! ప్రేమించుటయన నొకయాటయనుకొంటివా? ప్రేమనెంత యల్పమైనదానినిగా నెంచితివి! ప్రేమ యుజ్జ్వలదీప్తి; దానివలనగల్గు కాంక్షాతీవ్రత, విరహవేదన అను వీనినిగూర్చి నీకేమియు తెలియద'నివ్రాసి యాతనికి తుదిచీటినంపెను. అంత నాతడునిస్పృహుడై పరిష్యావెళ్లిపోయెను. ఈవిషయము చరిత్రయందంకితమైయున్నది.

రాజనగరున 'జీబున్నీసా' అత్యంతస్వేచ్ఛావర్తినియై యుండెను. ప్రసిద్ధులగు విద్వాంసుల కీమె లేఖలు వ్రాసి తన యాస్థానమునకు వారిని రప్పించుకొని వారితో శాస్త్రవిషయములను చర్చించుచు వచ్చెడిది.

ఈమె తనకు పెదనాన్నయగు దారాషెకోయెడల భక్తిగౌరవములుగలిగి మెలగుచుండెడిది. ఏలనన, అతడు గొప్ప విద్వాంసుడు. ఈమె పర్షియన్ భాషలో పద్యములల్ల నేర్చుకొనునా డీమె తనపద్యముల నతనిని గూర్చి వ్రాయుచుండెడిది. అప్పుడప్పుడీమె తండ్రిన్యాయసభకువెళ్లి తీర్పులిచ్చుటలో తండ్రికి తోడ్పడు చుండెడిది. ఈమె యంతఃపురములలో యసూర్యంపశ్యయైయుండియు జీవితమునందలి యానందముల ననుభ వింపఁగల్గియుండెను. ఈమె వ్రాయుటకుపయోగించు కలమునకు 'మక్ఫీ' (నిండి నిబిడమైనశక్తి కలదిఅను నర్థమిచ్చును) అనుపేరిడెను.

ఈమె తనమతమునందధికమగు నభిమానమును గలిగియుండెను. తనతండ్రి యవలంబించు సంకుచిత, పరమతసహిష్ణుతారహితమై దూషితమగు ఛాందసమతమును గాక, యీమె విస్తృతౌదార్యపరిపూతమైన సూఫీ మతమునవలంబించెను. ఈమె తండ్రివలెనే 'సూనీ' తెగకు చెందినదయ్యు, మతవిషయిక వివాదాంశములను గూర్చి వాదించి యితమిత్థమని, నిర్ణయింపఁగల చతుర. మతవిషయములలో మిక్కిలి యుదారదృష్టిగలది. ఒకానొక సమయమున నీమె తన యుద్యానవనమున విహరించుచు నచటగల ప్రకృతిదృశ్యములగని యానంద వివశయై యిట్లని పాడుకొనుచు బోవుచుండెను. "ద్రాక్షసారాయి, పుష్పములు, వినీలజలప్రవాహము, ప్రియుని ముఖారవిందము అనునవియే నాకానందదాయకములు." 'లయ' కుదిరిన పర్షియన్ గీత పాదముల రెంటిలో నీయానందదాయకములగువస్తుసమితినిమిడ్చి, యామె కానందమురేకెత్త, పాడుకొనుచు యావన మున నెవ్వరైన యాపాటను వినుచుందురేమోయనియైన సంకోచింపక, విచ్చలవిడి విహరించుచుండ, నావన మననే, నొకచ్ఛాయావృక్షముక్రింద నొకచలువరాతితిన్నెపై నాసీనుఁడై నిమీలితనేత్రుఁడగుచు 'యల్లా'ను నామము జపించుచుండిన తండ్రినికనుగొని సంభ్రమమును భీతియునంది యాగీతములో నొక పాదమునట్లు త్రుటిలో మార్చివేసి పాడదొరకొనెను. "ప్రార్థనలు, ఉపవాసములు, అశ్రువులు, పశ్చాత్తాపము అను నవియే నాకానందదములు."

మతవిషయికములగు తగవులేవేనివచ్చినచో విచారణకై 'జీబున్నీసా' సిద్ధపడుచుండెను. ఔరంగజేబు ఆమె విదుషియని యామె కట్టియవకాశమొసంగెను. మతవిషయికమగు తగవులన్నియు నామెచే పరిష్కరిం పఁబడుచువచ్చెను. ఆమె తీర్పులన్నియు న్యాయసమ్మతములై యామె న్యాయైకదృష్టిని చాటునవిగా నుండుటచే బ్రశస్తినిఁబడసి గ్రంథస్థములైనవి. ఆమె తీర్పులకు ప్రతులువ్రాయబడి యవి ఇరాన్, తురాన్ దేశములకుకూడ పంపబడుచుండెడివని ప్రతీతి. ఈమె న్యాయాధిపురాలై ప్రతిభతో కావించు తీర్పులనుగని కొందఱు బీగము లామె యవలంబించు 'సున్నీ' మతము నవలంబింపఁబూనిరి.

ఈమె యందుగల ప్రేమచే ఔరంగజేబు ఈమె ఖర్చులకొఱకు వత్సరమునకు నాలుగులక్షలరూపాయల ఇచ్చుచుండెడివాడు. ఈమె యీధనమును స్వీయమగు యైహికభోగానుభవములకై వెచ్చింపక, విద్య తోప్పషణమునకును, వితంతువుల సంరక్షణమునకును, తలిదండ్రులులేని బాలబాలికల రక్షణమునకును, ప్రతివత్సర మును మక్కామదీనాలకు యాత్రకైపోవు మహమ్మదీయభక్తుల నిమిత్తమును వినియోగముచేయుచుండెడిది. ఈమె మతాభినివేశము, దైవభక్తియు మానవసేవకై పూర్తిగా వినియోగింపఁబడినవి.

ఈమె యుద్గ్రంథములను సేకరించి యొకగ్రంథభాండారమును నిలిపెను. శిథిలమగుచున్న వ్రాత ప్రతుల కుత్తమప్రతులను నేర్పుగవ్రాయగల వ్రాతగాండ్రకు వేతనములనిచ్చి వ్రాయించెను. ఇందులకై వ్రాత గాండ్ర కొకప్రత్యేకమందిరము నేర్పరచి వారిచే గొప్ప గ్రంథములకు ప్రతులను వ్రాయించుచుండెను. చక్కని వ్రాత వ్రాయగల కాశ్మీరదేశపులేఖకులచే బ్రసిద్ధమగు చక్కని కాశ్మీరదేశపు కాగితములపై పటగ్రంథముల

ప్రతులను వ్రాయించెను. ప్రతియుదయమున నామెకడుశ్రద్ధతో యాలేఖకులు వ్రాసినప్రతులను పరిశోధించి మూలమునకును దానిప్రతికకును గల్గినభేదపాఠములను సవరించుచువచ్చెడిది. ఈమె సమకాలికులగు కవులెల్ల రీమెను కవయిత్రియని ప్రత్యేకముగుగణ్యతతోఁ జూచుచుండిరి. పరిష్యను, ఉరుదూభాషలలో గ్రంథములను రచించినకవులు తమకృతులనామె యభిప్రాయార్థమును •విమర్శనార్థమునుకూడ పంపుచుండిరి. ఆగ్రంథముల నామెశ్రద్ధతో చదివి యవి గుణయుక్తములైనచో యాకృతికర్తలకు బహుమానములను పంపుచుండెడిది.

కొందఱు మహమ్మదీయవనితలవలె యీమె తనదంతములకు 'కప్పు'నుగాని, కనురెప్పలకు కాటుకగాని ధరించెడిదిగాదట. ఈమె తన మాధుర్యమైన కంఠమెత్తి 'కొరాను'నుండి కొన్నిఘట్టములను చదివెనేని శ్రోతల హృదయములుకరగి మతావేశముచే యశ్రువులరాల్తురట. ఈమెదేహమున నేయలంకారములను ధరించెడిది గాదు. కంఠమున నొకముక్తాహారమును మాత్రము ధరించెడిదట. కష్టసహిష్ణుతలో గొప్ప యాధ్యాత్మిక బలమును ప్రదర్శించుచుండెను. ఈమె కొకప్రధానురాలైన మిత్రురాలుగలదు. ఆమెపేరు 'ఇమామి'. ఈమెకు కవిత్వమునందభినివేశముమెండు. జీబున్నిసాకు యుద్ధపాండిత్యముకూడగలదు. తనతండ్రికి యుద్ధములలో సహాయముచేయుచుండెడిది.

1662-వ సంవత్సరమున ఔరంగజేబునకు జబ్బుచేసెను. వైద్యులాతడుగాలి మార్పునకై స్థలాంతరమునకు బోవలయునని చెప్పిరి. అంతట ఔరంగజేబు సకుటుంబముగ లాహూరునకు వెడలెను. తనమంత్రికొమారుడగు 'అఖిల్ ఖాన్' ఆనగరమున గవర్నరుగానుండెను. అఖిల్ ఖాన్ సురూపశౌర్యాదిగుణగణవిరాజితుడేగాక కవికూడను. ఆతడు 'జీబున్నీసా' కవయిత్రియని యెఱిగియుండెను. ఆమెనెట్లయినచూడ సమయమునకై నిరీక్షించుచుండెను. నగరరక్షణవ్యాజమున, తనయశ్వారాజముపై నధిరోహించి, ఆమె నెట్లయినచూడగల్గుట తటస్థించునను నాశతో నౌరంగజేబు నివసించురాచనగరుచుట్టు గోడలవెలుపలి ప్రదేశమున పలుమారుతిరుగు చుండెను. ఒకనాటిసాయంకాలమున జీబున్నీసా దానిమ్మపూవన్నెగల వస్త్రమునుధరించి మేడపై విహరించు టనుజూచెను. ఆతడామెకు వినబడునట్లు "రక్తాంబరధారిణియగు నొకస్త్రీవ్యక్తి నాకు స్వప్నమునందువలె కన్పట్టుచున్నది"అనెను. ఆమె యదివిని "ఆమెనీకు శౌర్యముచేగాని, ధనముచేగాని, పాపము! లభింపదు." అని యాతని వాక్యమును పూర్తిచేసెను. మరియొకసమయమున నామె చెలికత్తెలనుగూడి తనతోటలోగల చలువరాతితో కట్టబడుచున్న మందిరమును చూచుటకు పోవుచుండుటనుగాంచి అఖిల్ ఖాన్ తానొక 'తాపీ' పనివాని వేషమువేసికొని పనివాండ్రతో చలువరాతితో కట్టబడుచున్న మందిరముకడకుజేరి ఆమెకు వినబడు నట్లు పరిష్యనుభాషలో 'నీకొఱకై యిట్టినీచపాత్రను ధరింపవలసిన వాడనైతి'ననెను. అందులకామె 'నీవు వాయురూపము ధరించినను నాకచభారమునగల నొక్కకేశమునైన కదల్పజాల'వని తృణీకారముతో ప్రత్యుత్తరమిచ్చెను. రెండవసారి యతడు పరిభవింపఁబడియు ఆమె నెచ్చటనైన తోటలోకలసి మాట్లాడనభిలషించి తిరుగుచుండెడివాడు. ఆమె తాను స్వయముగ తన వరునెన్నికొందుననియు, అందులకై యాయారాజుల చిత్ర పటములను దెప్పించుమని తండ్రినికోరెను. అటుల తెప్పింపఁబడిన చిత్రపటములనుచూచి వారిలో 'అఖిల్ ఖాను'నువరించి యాతని కొకలేఖవ్రాసెను. అందుపై రెండుసారులు పరిభవింపఁబడిన అఖిల్ ఖాన్ నీవంటి చక్రవర్తిపుత్రికను వివాహమాడుట నావంటివానికి యొకబాలక్రీడవంటిదిగాదని యెఱుంగుమనియు తానామెను వివాహమాడననియు తెలిపెను. అఖిల్ ఖాన్ యామెను కలిసికొనుచు యామెను వివాహమాడుటకుఁజేయు యత్నములను తెలిసికొని యామె నెవనికో వివాహముచేసి అఖిల్ ఖానువంటి వరులయొరపిడిలేకుండఁ జేసి కొనుటకై యౌరంగజేబు యత్నించెను. ఒకనాడు అఖిల్ ఖానును, జీబున్నీసాయును నొకయుద్యానవనమున మాట్లాడుకొనుచుండ జీబున్నీసా, ఔరంగజేబు వచ్చుచుండుటనుగాంచి యాతని నచటగలనొక 'దేగిసా'లో

గూర్చుండబెట్టి 'నీవు నాయందు నిజముగు వలపుగలవాడవేని నిశ్శబ్దముగ నందుగూర్చుండుము. వలపుతెవులుచే బాధపడువారల కిట్టిదుర్దశయేకడపటిశాస్తి' యనుచు నొవ్వనాడెను.

ఈమె తనకు శత్రువగు శివాజీయెడల సానుభూతిగల్గి వర్తించుచున్నదనియు, ఒకవేళ యాతనియందు వలపునిలిపి యాతనిని వివాహమాడునేమోయనియు భయమంది యౌరంగజేబు జీబున్నీసాను కొంతకాలము 'సలీమ్‌ఘర్' కోటలో బందీకృతనుజేసెను. ఖైదులోనుంచబడినప్పు డీమెపరిష్యనుభాషలో కొన్నిభావగర్భిత ములగు గీతములరచించెను. మతవిషయమున నీమె యక్బరువలె హిందూమహమ్మదీయసమ్మేళమును వాంఛించెను. ఈమెకు యిస్లాముమతరహస్యములేగాక, హిందూమతమునుగూర్చియు, జొరాస్ట్రియన్ మతమును గూర్చియు బాగుగఁదెలియును. ఈమె రచించిన కొన్నిగీతములలో సూర్యభగవానుని కీర్తించెను. ఈమె రచనలలో 'దివానీమక్ఫీ' అనుపేరుగల పద్యగ్రంథము హిందూదేశమంతటను పలువురచే చదువఁబడుచున్నది. అది పరిష్యనుసారస్వతమున ప్రసిద్ధినిగన్నది.

తనకు సముడగువరుడు లభింపమి తనజీవితాంతవరకు నవివాహితగనే యేబదిసంవత్సరములు జీవించి యీమె 1689-వ సంవత్సరమున పరమపదించెను. ఈమె తాను చనిపోవుటకుముందు రచించినగీతమున నిట్లు తన్నభివర్ణించుకొనెను. "నేనొకరాకొమరితను. నాజీవితకాలమున నేనొకవిరక్తమార్గము ననుసరించితిని. 'స్త్రీలోకమున నేనొక ప్రతిభయైనవ్యక్తి'నను నానామమునగల యర్థమునాయెడల సార్థకమైనదను తృప్తితో నీలోకమును వీడుదును."

—From The 'Diwan of Zebunissa' of 'The Wisdom of the East Series'

పునశ్చ: ఔరంగజేబు, 1663-వ సంవత్సరమున కాశ్మీరముననున్నప్పుడు ఋషి'పీర్'*తో, తాను భుజించునప్పుడెల్ల తనకురక్తము కన్నులకుగట్టినట్లు కనుపడుచుండుననియు అందులకు కారణమేమైయుండునని యడిగెను. అందులకు 'ఋషిపీర్' ఔరంగజేబు నిష్కారణముగ జంపించిన 'శర్మద్'రక్తమేయట్లు కనుబడుచున్నదనిచెప్పెను. 'శర్మద్' సూఫీమతతత్వమునం దభినివేశముగల యొక సన్యాసి. ఇతడు గొప్పజ్ఞాని. పరిష్యన్ భాషలో గీతముల నాశుధారగరచించి పాడగలకవియు, గాయకుడునైయుండెను. ఒకనాడతడు ఢిల్లీ రాజనగరు సమీపమునుండి పోవుచుండగా మేడమీదనుండి యౌరంగజేబుకుమార్తె జీబున్నీసా యాతనిపాటలను కౌతుకముతో వినుచుండెను. శర్మద్ ఆసౌందర్యరాశింగనుఁగొని మోహవశుడై గంభీరస్వనమున నిట్లనెను. "మానవహృదయసంక్షోభమును తొలగించి దుఃఖమును రూపుమాపునవి ఈప్రపంచమున నాల్గేగలవు." జీబున్నీసా ఆమాటనందుకొని "సారాయి, ఆకుపచ్చని మైదానము, జలజలప్రవహించు సెలయేరు, సుందరి ముఖారవిందము అను నీనాల్గే మానవునిదుఃఖమును మాన్పునవి" అని పూరించెను. ఆమెకుసమీపమున గదిలో కూర్చుండిన ఔరంగజేబు తనకుమార్తె యశ్లీలవాక్కుల కామెపై కోపించెను. జీబున్నీసా తనతండ్రిప్రక్కనున్నట్లు తెలిసికొని మరల నిట్లనెను. "ప్రార్థన, ఉపవసించుట, జపమాలిక, పశ్చాత్తాపము అనునవియే ఈశ్వరానుగ్రహముబడయుటకు సాధనచతుష్టయము" అని మార్చిపలికెను. అంతట ఔరంగజేబు జనానాస్త్రీలు సంచరించెడు మేడసమీపమున శర్మద్ వివస్త్రుడై తిరుగుచున్నందుల కతనినిబంధించి యాతనిని విచారణచేసి యతనికి ఉరిశిక్షవిధించెను. ఇట్టిఘోరశిక్షవిధించినందులకే'శర్మద్'రక్తమే ఔరంగజేబునకు భోజనసమయమున కనబడుచుండెనని ఋషిపీరు ఔరంగజేబుతోనసెను. ఋషిపీరు ప్రార్థనసలిపి ఔరంగజేబునకు భోజన సమయమున రక్తముకనబడకుండఁజేసెను.

---

*ఆనందకౌలుగారి 'ఇండియన్ ఆంటిక్వేరి', జూలై, 1931 పత్రికలోని ఋషిపీర్ జీవితచరిత్రనునుండి.